


PRGI NO: TGTEL/25/A5314
# అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaachaaram.com | బుధవారం 10, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 164 | పేజీలు : 8 , వెల.2.00

## బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా
# మహిళకు ఇచ్చారా?



- దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సే
- మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశాం
- మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు
- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

3

అర్జున్ సమాచారవమ్ ప్రతినిధి

మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు.దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.



## హోర్ముజ్ సమీపంలో కూలిన యూఎస్ ఆర్మీ హెలికాప్టర్

అమెరికా ఆర్మీకి చెందిన ఒక అపాచీ హెలికాప్టర్ హోర్ముజ్ జలసంధికి సమీపంలో కూలిపోయింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఇరాన్ దాడితో అపాచీ కూలిపోయిందా? లేక మరేదైనా సాంకేతిక లోపం తలెత్తిందా? అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. ఇజ్రాయెల్, ఇరాన్‌లు పరస్పర దాడులకు దిగిన రోజే హెలికాప్టర్ కూలినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

2



## సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్..

### అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలంటూ డిమాండ్

అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు.

వార్త 2లో




## లోక్‌సభలో టీఎంసీ చీఫ్ విప్‌గా కల్యాణ్ బెనర్జీ.. స్పీకర్‌కు మమత లేఖ

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది పార్టీ సుప్రీం మమతాబెనర్జీపై తిరుగుబాటు బావుటా ఎగరవేయడం, ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన నేపథ్యంలో ఆ పార్టీ అధినాయకత్వం తక్షణ చర్యలకు దిగింది. లోక్‌సభలో కొత్త చీఫ్ విప్‌గా పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీని నియమించింది.

2

## సింగరేణిని దోచుకుంటున్న
# ప్రభుత్వం



సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉందని ప్రెస్ రిలీజ్ చేశారని వివరించారు.

2



## గంజాయి పార్టీపై పోలీసుల దాడి.. ఆయుర్వేద వైద్యుడి అరెస్ట్

వార్త 2లో

## రైతులకు బీజేపీ శనిలా
# తయారైంది: వేముల వీరేశం



తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు బీజేపీ ఓ శనిలా తయారైందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలు.. ప్రధాని మోదీకి చెప్పి ధాన్యం కొనుగోలు చేయిస్తారని రైతులు ఎదురు చూశారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలతో రైతులకు ఎలాంటి లాభం లేదని వ్యాఖ్యానించారు.

వార్త 2లో




## రిజైన్ చేసి హ్యాపీగా వెళ్లిపోవచ్చు... రెబల్ ఎంపీలకు టీఎంసీ ఘాటు సందేశం

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తిరుగుబాటు ఎంపీలు పలువురు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమితో కలిసి పనిచేయనున్నట్టు ప్రకటించడంపై ఆ పార్టీ అధినాయకత్వం తొలిసారి స్పందించింది. ఇది ముమ్మాటికీ నయవంచనేనని టీఎంసీ సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అన్నారు. మంగళవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, ద్వంద్వ వైఖరి కలిగిన వ్యక్తులు పార్టీ నుంచి వెళ్లిపోవడమే మంచిదని అన్నారు.

2

## పీవోకేలో భారీ కాల్పులు..
# 30 మందికి పైగా మృతి, 200మందికి గాయాలు..?

2



## సూర్య ఘర్ యోజనతో ఉచిత విద్యుత్: మంత్రి జూపల్లి

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మంత్రి జూపల్లి కృష్ణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా గ్రామీణ కుటుంబాలు విద్యుత్ వ్యయాన్ని తగ్గించుకొవచ్చన్నారు. అంతేకాకుండా మిగులు విద్యుత్ తో ఆదయం పొందే అవకాశం ఉందన్నారు. గ్రామంలో మొత్తం 630 కుటుంబాలున్నాయి. 469 కుటుంబాలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలు సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న సబ్సీడీ ప్రయోజనాలను పొందాలన్నారు.



## ముగ్గురిని కాపాడి అమరుడైన
# అనురూప్.. సీఎం రేవంత్ నివాళులు

ముగ్గురు స్నేహితుల ప్రాణాలను కాపాడి తన ప్రాణాలను కోల్పోయిన తెలంగాణ బిడ్డ కోడూరు అనురూప్ రెడ్డి కి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఘనంగా నివాళులర్పించారు. అత్యంత విషాదభరితమైన ఈ సంఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి గారు ఆదేశాల మేరకు ఈరోజు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి వారింటికి వెళ్లి అనురూప్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా గత నెల 30న స్నేహితులతో కలిసి లూసియానాలోని టోరోడో పార్కు వద్ద సెబాన్ నది వద్దకు వెళ్లారు.



# బీఆర్ఎస్ నేతలు తెలంగాణను దోపిడీ చేశారు

ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారు

పేదలకు చెందాల్సిన సొమ్మును దోచుకుంది

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదు

76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం

దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి

కేంద్రం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదు

ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జనగామ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి



ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు.'ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230ఖఎ సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## హోర్ముజ్ సమీపంలో కూలిన యూఎస్ ఆర్మీ హెలికాప్టర్

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

అమెరికా ఆర్మీకి చెందిన ఒక అపాచీ హెలికాప్టర్ హోర్ముజ్ జలసంధికి సమీపంలో కూలిపోయింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఇరాన్ దాడితో అపాచీ కూలిపోయిందా? లేక మరేదైనా సాంకేతిక లోపం తలెత్తిందా? అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. ఇజ్రాయెల్, ఇరాన్‌లు పరస్పర దాడులకు దిగిన రోజే హెలికాప్టర్ కూలినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హెలికాప్టర్ కూలిన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ధ్రువీకరించారు. పైలట్లు క్షేమంగానే ఉన్నారని అన్నారు.హోర్ముజ్‌లో ఇరాన్ దూకుడును కట్టడి చేసేందుకు అపాచీ హెలికాప్టర్‌లతో పాటు రీపర్ డ్రోన్లు, ఎఫ్/ఏ-18, ఎఫ్-35 ఫైటర్ జెట్స్‌ను యూఎస్ వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకూ 42 రెండు మిలిటరీ విహంగాలను యూఎస్ కోల్పోయినట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. అయితే, అపాచీ హెలికాప్టర్‌ను కోల్పోవడం మాత్రం ఇదే తొలిసారని తెలుస్తోంది.ప్రపంచంలోని అత్యాధునిక మిలిటరీ హెలికాప్టర్‌లలో అపాచీ కూడా ఒకటి. హెల్‌ఫైర్ మిసైల్స్‌తో ఇది శత్రుమూకలను టార్గెట్ చేస్తుంటుంది. యుద్ధ ట్యాంకులను కూడా ఈ మిసైల్స్ ధ్వంసం చేయగలవు. శత్రుదేశ దాడులను తట్టుకునేలా గట్టి కవచం కూడా ఈ హెలికాప్టర్‌లో ఉంటుంది. హోర్ముజ్‌లో డ్రోన్స్, ఇతర చిన్న బోట్లను టార్గెట్ చేసేందుకు యూఎస్ అపాచీ హెలికాప్టర్‌లను వినియోగిస్తోంది.

## లోక్‌సభలో టీఎంసీ చీఫ్ విప్‌గా కల్యాణ్ బెనర్జీ.. స్పీకర్‌కు మమత లేఖ

న్యూఢిల్లీ: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది పార్టీ సుప్రీం మమతాబెనర్జీపై తిరుగుబాటు బావుటా ఎగరవేయడం, ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన నేపథ్యంలో ఆ పార్టీ అధినాయకత్వం తక్షణ చర్యలకు దిగింది. లోక్‌సభలో కొత్త చీఫ్ విప్‌గా పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీని నియమించింది. ఈ నియమాకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు పార్టీ చైర్మన్, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లోక్‌సభ స్పీకర్‌కు అధికారికంగా లేఖ రాశారు.పార్టీ నూతన నియామకానికి సంబంధించిన సమాచారాన్ని పార్లమెంటు రికార్డుల్లోకి తీసుకోవాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పీకర్ ఓం బిర్లాను మమతా బెనర్జీ కోరారు. నూతన నియామకం ప్రకారం పార్టీ ఎంపీలను సమన్వయం చేయడంలో కల్యాణ్ బెనర్జీ కీలక పాత్ర పోషించనున్నారు .మరోవైపు, తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని, అందుకు తగినట్టుగా సీటింగ్ ఏర్పాటు చేయాలని కోరినట్టు టీఎంసీ తిరుగుబాటు వర్గం ఎంపీ కకోలీ ఘోష్ దస్తీదార్ చెప్పారు. 20 మంది ఎంపీల సంతకాలతో స్పీకర్‌కు లేఖ పంపినట్టు చెప్పారు. లోక్‌సభలో 28 మంది టీఎంసీ ఎంపీలు ఉండగా, 20 మంది ఎంపీలు బయటకు వస్తే అనర్హత వేటు నుంచి తప్పించుకునే వీలు ంది. తమదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని స్పీకర్ లేఖ ఇస్తే గుర్తింపు పొందే వీలుంది.

## రిజైన్ చేసి హ్యాపీగా వెళ్లిపోవచ్చు... రెబల్ ఎంపీలకు టీఎంసీ ఘాటు సందేశం

న్యూఢిల్లీ: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తిరుగుబాటు ఎంపీలు పలువురు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమితో కలిసి పనిచేయనున్నట్టు ప్రకటించడంపై ఆ పార్టీ అధినాయకత్వం తొలిసారి స్పందించింది. ఇది ముమ్మాటికీ నయవంచనేనని టీఎంసీ సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అన్నారు. మంగళవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, ద్వంద్వ వైఖరి కలిగిన వ్యక్తులు పార్టీ నుంచి వెళ్లిపోవడమే మంచిదని అన్నారు. పార్టీ పట్ల అంతగా అసంతృప్తి ఉంటే వాళ్లు రాజీనామా చేయాలన్నారు.'రెండు రకాల వ్యక్తిత్వాలు కలిగిన వ్యక్తులు వెళ్లిపోతే మాకు కూడా చాలా సంతోషం. వెళ్లిపోవాలనుకునే వాళ్లు వెళ్లిపోవచ్చు. మాకెలాంటి అభ్యంతరాలులేవు. అయితే మీరు తృణమూల్ కాంగ్రెస్ పేరును మాత్రం తీసుకెళ్ల లేరు. ప్రజలకు నిజం ఏమిటో తెలుసు, వాళ్లు మావెంటే నిలుస్తారు' అని కల్యాణ్ బెనర్జీ అన్నారు. పార్టీతో ఎవరికైనా విభేదాలుండి పార్టీలో ఇమడలేమని అనుకున్నా, ఇందుకు బదులుగా ఎవరికైనా మద్దతు ఇవ్వాలని అనుకున్నా పార్టీకి రాజీనామా చేయడం కనీస నైతిక బాధ్యత అని అన్నారు.

### లేఖ ఎందుకు బయటపెట్టడం లేదు?

తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకరుకు లేఖ రాసి ఉంటే అందులోని సమాచారం ఎందుకు బయటపెట్టడం లేదని కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. 'ఎంతమంది ఆ లేఖలో సంతకం చేశారో, ఎందరు చేయలేదో నాకు తెలియదు. దీనిపై ఎవరెవరు ఏమి మాట్లాడుతున్నారో కూడా తెలియదు. లేఖ రాసిన 24 గంటల తర్వాత కూడా ఎందుకు దానిలోని విషయాలను బహిరంగం చేయడం లేదు. ఎవరూ ఆ లేఖను చూడలేదు. ఇలాంటి కీలక విషయంలో నిజాయితీ అనేది అవసరం' అని అన్నారు. తిరుగుబాటు ఎంపీలకు మరో పార్టీతో విలీనం అయ్యేంత సంఖ్యాబలం లేదన్నారు. అందువల్ల ఏ ఒక్క ఎంపీని బీజేపీ తీసుకోదని ధీమా వ్యక్తం చేశారు.

## సింగరేణిని దోచుకుంటున్న ప్రభుత్వం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్,

సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉందని ప్రెస్ రిలీజ్ చేశారని వివరించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని పేర్కొన్నారు.బుధవారం ఉదయం 11.00 గంటలకు ఆ బొగ్గు నిల్వలను చూపించాలని మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. 3 లక్షలకు పైగా బొగ్గు నిల్వ ఉందన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాను, మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరమే అక్కడికి వెళ్తామన్నారు. బొగ్గు నిల్వ లేకపోతే తప్పు చేశామని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి విషయంలో వేలు పెట్టలేదని గుర్తు చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణిలో ఆయన వేలు పెట్టారని స్పష్టం చేశారు. రెండు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేని పరిస్థితి సింగరేణిలో నెలకొందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు.సింగరేణిలో 26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుపై సీబీసీఐడీతో విచారణ జరిపేలా ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. రూ. 4 వేల కోట్ల ఓడీ ఎందుకు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన బల్లగుద్ది ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్‌తోపాటు కిషన్ రెడ్డి కూడా బాధ్యత వహించాల్సి ఉందన్నారు.గతంలో సింగరేణిలో 20 వేల ఉద్యోగాలు ఉండే.. కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కారుణ్య నియామకాలు కింద 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. దీంతో ఆ సంస్థలోని 36 వేల మంది ఉద్యోగులు నష్టపోయేలా పరిస్థితి ఉందన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్..

### అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలంటూ డిమాండ్

హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.

### ఎమ్మెల్యే హరీశ్ రావు ఎక్స్ పోస్టు..

'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది.కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. మాయమాటలు చెప్పి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక అబద్ధాల ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ వైఖరి ఉంది. సమస్యల పరిష్కారం కోసం 'ఛలో సెక్రటేరియట్' పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ పోస్టు పెట్టారు.

## పీవోకేలో భారీ కాల్పులు.. 30 మందికి పైగా మృతి, 200మందికి గాయాలు..?

కరాచీ:

పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో అల్లర్లు చెలరేగి స్థానికులు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ) మద్దతుదారులు 30మందికి పైగా మృతిచెందగా.. సుమారు 200మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఆర్థిక, రాజకీయ సమస్యలపై నిరసనలు చేపడుతున్న జేఏసీ సంస్థను పాకిస్థాన్ ప్రభుత్వం గత వారం నిషేధించడంతో భారీ ఉద్రిక్తతలు చెలరేగాయి. ఆదివారం రావల్‌కోట్‌లో నిరసనకారులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణల్లో పదులకొద్దీ ఆందోళనకారులు మృత్యువాత పడినట్లు సమాచారం.జేఏఏసీని ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ నిషేధించడంతో శుక్రవారం రాత్రి ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో పోలీసుల కాల్పుల్లో ఓ వ్యాపారి మరణించారంటూ ఆరోపణలు రావడంతో నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. ఆదివారం రాత్రి వ్యాపారి మృతదేహాన్ని ఉంచిన ఆస్పత్రి మార్చురీ బయట జేఏఏసీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో గుమిగూడారని రావల్‌కోట్ కమిషనర్ సర్దార్ వహీద్ ఖాన్ తెలిపారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా.. కొందరు నిరసనకారులు ఆటోమేటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు, ఇతర ఆయుధాలతో దాడి చేశారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎదురుకాల్పులకు దిగగా.. ఆరుగురు నిరసనకారులు మృతిచెందారని కమిషనర్ పేర్కొన్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు కూడా ఆయన వెల్లడించారు.అయితే, అధికారుల కథనాన్ని జేఏఏసీ మద్దతుదారులు ఖండించారు. అధికారుల లెక్కల కంటే మృతుల సంఖ్య అధికంగా ఉంటుందని ఆరోపిస్తున్నారు. జులై 27న జరగనున్న ప్రాంతీయ శాసనసభ ఎన్నికల్లో 45 స్థానాలకు గాను 12 స్థానాలను శరణార్థులకు కేటాయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ జేఏఏసీ నిరసనలకు పిలుపునిచ్చిన ఒకరోజు ముందు ఈ ఘటన చోటు చేసుకుంది. మరోవైపు ఇంటర్నెట్ నిలిపివేతలు, విద్యుత్ కొరత, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, సహజ వనరుల దోపిడీ, రాజకీయంగా పక్కన పెట్టడం వంటి అంశాలపై కొన్ని నెలలుగా జేఏఏసీ ఆందోళనలు చేస్తోంది. పలు ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ప్రజా సంక్షేమం దృష్ట్యా జేఏఏసీని స్థానిక ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

## రైతులకు బీజేపీ శనిలా తయారైంది: వేముల వీరేశం

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు బీజేపీ ఓ శనిలా తయారైందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలు.. ప్రధాని మోదీకి చెప్పి ధాన్యం కొనుగోలు చేయిస్తారని రైతులు ఎదురు చూశారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలతో రైతులకు ఎలాంటి లాభం లేదని వ్యాఖ్యానించారు. రైతుల ముందు మోదీనే మోకరిల్లిన చరిత్రను బీజేపీ నాయకులు మరిచిపోయారా అని ప్రశ్నించారు.నల్ల చట్టాలని వెనక్కి తీసుకున్న చరిత్ర మోదీది అంటూ వీరేశం వ్యాఖ్యానించారు. 15వ తేదీలోపు రాష్ట్రంలో ప్రతి గింజా కొనుగోలు చేస్తామని బీజేపీ ప్రకటించాలని.. లేదంటే బీజేపీ నాయకుల ఇళ్లు ధాన్యంతో నిండిపోతాయన్నారు. రైతుల కోపానికి బీజేపీ బలికాక తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఉందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసేది బీజేపీ అయితే.. బీజేపీకి బీ టీమ్‌గా బీఆర్ఎస్ పని చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం లేకున్నా పెద్ద ఎత్తున పంట వస్తే అసత్య రాజకీయ క్రీడకి తెరలేపారంటూ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## గంజాయి పార్టీపై పోలీసుల దాడి.. ఆయుర్వేద వైద్యుడి అరెస్ట్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

నగరంలోని పాతబస్తీ చంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పార్టీపై పోలీసులు దాడులు చేశారు. క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఓ ఇంటిలో గంజాయి పార్టీ జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి... ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 220 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడుల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు అతౌల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మెడికల్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు.

## రెండు లారీలు ఢీ.. ఒకరు సజీవదహనం

అనంతపురం జిల్లా

డి.హీరేహాల్ మండలం జాజరకల్ టోల్‌ప్లాజా సమీపంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఒక సిమెంట్ ట్యాంకర్‌ను వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రెండు లారీల్లోనూ ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. లారీ క్యాబిన్‌లో మంటలు వేగంగా వ్యాపించడంతో ఒక వ్యక్తి బయటకు రాలేక అక్కడికక్కడే సజీవదహనమయ్యారు.ప్రమాద తీవ్రతకు రెండు లారీలు కూడా చాలా వరకు మంటల్లో కాలిబూడిదయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

## ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సిఎం, డిప్యూటి సిఎంల భేటీ



**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జూన్ 10వ తేదీన నిర్వహించనున్న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో వీరు పాల్గొన నున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరుకానుండగా, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. దేవిధంగా, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగవచ్చని సమాచారం. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు కేంద్ర నాయకత్వంతో చర్చించే అవకాశం ఉంది.

## నామినేషన్లు వేసిన టిడిపి రాజ్యసభ అభ్యర్థులు

**అమరావతి**

టీడీపీ రాజ్యసభ అభ్యర్థులుగా సానా సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఉదయం ఏపీ అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10:50 గంటల నుంచి 11:50 గంటల వరకు నామినేషన్ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణికి ముగ్గురు టీడీపీ అభ్యర్థులు.. రెండు సెట్‌ల చెప్పున నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హాజరయ్యారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీగా తరలివచ్చారు. జనసేన ఎమ్మెల్యేలు, బీజేపీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కూటమి ఐక్యతకు ప్రతీకగా రాజ్యసభ నామినేషన్ కార్యక్రమం జరిగింది. వంగవీటి రాధాకృష్ణ సహా పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం అసెంబ్లీలో సందడిగా సాగింది. అంతకుముందు ఉదయం వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సాన సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వెంకటపాలెం టీటీడీ దేవస్థానం పండితులు సాదర స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వరకు టీడీపీ అభ్యర్థులు సైకిళ్లపై వెళ్లి.. ఆపై నామినేషన్ దాఖలు చేశారు.

## సిగరెట్‌లా ..సమాజానికి వైసిపి తీవ్ర హానికరం

### ఈ విషయాన్ని కూటమి నేతలు రోజూ చెప్పాల్సిందే

### నంద్యాల పర్యటనలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**నంద్యాల**

సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరమని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతిరోజూ కూటమి నేతలు ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రత్యర్థి ప్రజాస్వామ్యవాది కాదని.. అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని ఎద్దేవా చేశారు. సోమవారం నంద్యాల జిల్లాలో మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ లైన్ దాటి అధికారాన్ని ఉపయోగించరని, కానీ జగన్ రెడ్డి రోజూ లైన్ దాటుతారని చెప్పారు. ఏపీలో జగన్ అరాచక పాలన మళ్లీ రాకూడదంటే.. 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్' అని చాటి చెప్పాలని మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన 93శాతం స్ట్రైక్ రేటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని వ్యాఖ్యానించారు. నాడు పోలింగ్ బూత్ స్థాయిలో వెనకడుగు వేయకుండా జెండా పట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్త శ్రమ, ధైర్యమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలను మరిచిపోతే ఏ రాజకీయ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాగించలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోయే నాయకులందరి కోసం తాము కష్టపడాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదని మంత్రి పయ్యావుల హెచ్చరించారు. కార్యకర్తలు, నేతలు అలకలు వీడాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అలిగి పార్టీకి దూరమవ్వద్దని చెప్పారు. కొట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రాయలసీమ రాజకీయాల్లో అప్రమత్తత అవసరమని తెలిపారు. గొడ్డలి పార్టీపై నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనం ప్రభుత్వంలో ఉన్నామని నిద్రపోవద్దని చెప్పారు. టీడీపీ శ్రేణులు ఓటర్ లిస్ట్‌పై పట్టు సాధించాలని దిశానిర్దేశర చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య

### సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం

**వాషింగ్టన్,**

అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ పాత్రపై అగ్రరాజ్య సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం వ్యక్తం చేశారు. పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌తో శత్రుత్వం నేపథ్యంలో పాకిస్థాన్ నిష్పాక్షిక మధ్యవర్తిగా వ్యవహరించలేదని గ్రాహం అభిప్రాయపడ్డారు. ఇరాన్‌తో శాంతి చర్చల్లో పాల్గొంటున్న దేశాలు అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన పిలుపుపై పాకిస్థాన్ ఆసక్తి కనబరచలేదు. అబ్రహం ఒప్పందాల్లో చేరేది లేదని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో పాక్‌పై గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే దేశం మధ్యవర్తిగా వ్యవహరించడం మరింత సమస్యాత్మకం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌పై పాకిస్థాన్ సుదీర్ఘ కాలంగా ద్వేషంతో రగిలిపోతోంది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గతంలో పాక్ ఉన్నత స్థాయి అధికారులు చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరంగా ఉన్నాయి. అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలని ట్రంప్ ఇచ్చిన పిలుపునకు పాక్ వెంటనే సమాధానం ఇవ్వాలి. పాక్ ఎయిర్‌బేస్‌లో ఇరాన్ సైనిక విమానాలు పార్క్ చేసి ఉన్నట్టు ఇటీవల వచ్చిన వార్తలు అవాస్తవాలని కొట్టిపారెయ్యలేం' అని గ్రాహం పేర్కొన్నారు.

---

### భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీ

### క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ

### ట్యాంపర్ చేయకుండా పకడ్బందీగా భూ రికార్డులు


### గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారు

### గొడ్డలి పట్టే వారికి నాగలి పట్టే వారి బాధలు ఎలా తెలుస్తాయి

### ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నాం

### సిద్ధాంతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ

### సాగు,తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్న చంద్రబాబు



**భీమవరం**

ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని అన్నారు. సోమవారం సిద్ధాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగు నీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు. ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాలో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. అక్వా రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. గొడ్డలి పట్టుకునే వారికి నాగలి పట్టుకున్న రైతు గుర్తుకు రాలేదని వ్యాఖ్యానించారు. 'మీ భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీది.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేశామని చెప్పారు. 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూ రికార్డులు అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26 లక్షల పాస్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. నిషేధిత జాబితా 22ఎలో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.8వేల కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాము. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు అందిస్తున్నాము. రీ-సర్వే, ఈ-కేవైసీ పక్రియల అనంతరం మాత్రమే పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నాము. రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ.10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ.100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని, 15 జిల్లాల్లోని 33,012 ఎకరాల షరతు గల పట్టా భూములపై ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడానికి నెలల తరబడి పట్టేదని, ప్రస్తుతం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆక్వా చెరువులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, దాణా ధరలు పెరగడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఆక్వా రంగం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకమని పేర్కొన్న సీఎం, ఆ రంగానికి అన్ని విధాలా మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించి న్యూట్రాస్యూటికల్ ఔషధాల తయారీకి అవకాశాలు ఉన్నాయని కూడా సూచించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## పరీక్షలంటే తెఇయని వారు విమర్శలా


### విద్యార్థులకు జగన్ క్షమాపణలు చెప్పాలి

### ఇక్కడ చాలదన్నట్లు తెలంగాణలోనూ భూ కబ్జాలు

### జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

**భీమవరం,**

నా దగ్గర తోక జాడిస్తే చూస్తూ ఊరుకోను. నేను సీఎంగా ఉన్నంతవరకు ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టనని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. సిద్ధాంతంలో పట్టాదారు పుస్తకాల జారీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీవి అన్నీ తప్పుడు ప్రచారాలే. నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర వైసీపీది. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాకే జగన్ రాజకీయాలు చేసుకోవాలని హెచ్చరించారు. వివేకాను చంపి.. నా చేతిలో గొడ్డలి పెట్టారు. జగన్ వంటివారికి ఎప్పటికప్పుడు బుద్ధి చెప్పాలి. పరీక్షలు అంటే తెలియనివాళ్లు విమర్శలు చేస్తున్నారని అంటూ సీఎం దుయ్యబట్టారు. తెలంగాణలోనూ వైసీపీ నేతలు భూములను కాజేయాలని చూశారని సీఎం తెలిపారు. ఇక్కడ చాలదన్నట్లు.. తెలంగాణలోనూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు.



కోడికత్తి డ్రామాలు చేసేవారికి రైతుల బాధలు తెలియవన్నారు. తిరుమల దేవదేవుడి అంశంలోనూ ద్రోహం చేశారని మండిపడ్డారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే దుర్మార్గులను దూరం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ఒక్క పరిశ్రమ రాలేదని.. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డులు తారుమారు కావడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయి. ఒకప్పుడు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగిన పటిష్టమైన భూ రికార్డుల వ్యవస్థ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు తక్కువగా ఉండేవి. కానీ గత పాలకుల నిర్వాకంతో భూ యాజమాన్య సమస్యలు పెరిగిపోయాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట తీసుకొచ్చిన చట్టం రైతుల భూములపై అనిశ్చితి సృష్టించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి రైతుల యాజమాన్య హక్కులను కాపాడామని వివరించారు.

## వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలి పార్టీ కుట్ర

### ఆపార్టీ కార్యకర్తతో చేయించి, కూటమిపై నెట్టే యత్నం

### నంద్యాల ఘటనపై మంత్రి అనగాని ఘాటు విమర్శలు

**అమరావతి,**

నంద్యాలలో వైఎస్ విగ్రహం విధ్వంసం ఘటనపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి.. దాన్ని టీడీపీ మీద నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జంబులయ్య భార్యకు మెప్మాలో గత ప్రభుత్వంలో ఉద్యోగం ఇచ్చారని... నాటి వైసీపీ ఎమ్మెల్యేనే ఆ ఉద్యోగం ఇప్పించారని తెలిపారు. మనుషుల తలకాయలే తీసిన గొడ్డలి పార్టీ నేతలకు.. విగ్రహాల తలలు తీయడం ఓ లెక్క కాదన్నారు. విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ నేతలే తీయించడం.. మళ్లీ ధర్నాలు చేయడం ఆ పార్టీకే చెల్లిందంటూ దుయ్యబట్టారు. శవం, సింపతీ, స్టాట్యూ అనేది గొడ్డలి పార్టీ విధానమంటూ వ్యాఖ్యానించారు. వైఎస్ మరణంతో రాష్ట్ర వ్యాప్తంగా విగ్రహాలు పెట్టి రాజకీయం చేశారని.. ఇప్పుడు అదే విగ్రహాలను విధ్వంసం చేసి రాజకీయం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. గతంలోనూ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి తెలుగుదేశం పార్టీపై నెపం నెట్టే ప్రయత్నం చేశారన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం విషయంలో కుట్రలు బయటపడ్డాయి కాబట్టి... సాక్షిలో పెద్దగా కవరేజ్ ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని గొడ్డలి పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తుంటే.. డీఎస్సీలో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు గుప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యవహారాలు బయటపడుతుండడంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఏడాది క్రితం జరిగిన డీఎస్సీ నిర్వహణకు సంబంధించి ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు పన్నడం, అసత్య ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉందంటూ వ్యాఖ్యానించారు. జెన్–జీ, జెన్–అల్ఫా భవితకు అవసరమైన అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని అనగాని తెలిపారు. ఎన్నో పెట్టుబడులు వస్తున్నాయని... ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖచిత్రం మారుతోందని.. దీన్ని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. రాష్ట్రం అగ్రస్థానంలోకి వెళు తున్నప్పుడు... అనిశ్చితి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ స్కాం.. లిక్కర్ స్కాంలు బయటకొస్తుంటే గొడ్డలి పార్టీలో వణుకు పుడుతోందన్నారు. తానిచ్చే బిర్యానికి కార్యకర్తలు ఎదురు చూస్తూ ఉండాలనే ఆలోచన గొడ్డలి పార్టీ నాయకుడిదంటూ దుయ్యబట్టారు. ప్రజలు చక్కటి ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని మెరుగైన జీవితాన్ని పొందాలనేది తమ నాయకుడి ఆలోచన అని తెలిపారు. ఓ డీఎస్సీని అద్భుతంగా నిర్వహించి.. మళ్లీ ఇంకో డీఎస్సీని నిర్వహించు కునేందుకు సిద్ధమవుతుంటే.. కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. యువకులు నిర్వీర్యమైపోవాలనేది గొడ్డలి పార్టీ ఆలోచన అని.. యువతకు ఉద్యోగాలు కల్పించాలనేది కూటమి సంకల్పమని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# సంస్కరణలతో గాడినపడుతున్న విద్యారంగం

ప్రభుత్వ విద్యా సంస్థల్లో సంస్కరణలు ప్రారంభించిన తెలంగాణ సర్కార్ విద్యార్థుల డ్రాపవుట్స్ అరికట్టేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేయడాని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఇందుకు కారణాలను గుర్తించి చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా పూటగడవని కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు మానేసి పనులకు వెళ్తుండడంతో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. దీనికి పరిష్కారంగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను ప్రవేశపెట్టిన సర్కార్ ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం కూడా ఇదే తరహా చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం స్వాగతించాల్సిన అంశం. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు జూనియర్ కళాశాలలకు వచ్చేసరికి మధ్యలో చదువు ఆపేస్తుండడంతో పేదలు ఉన్నత విద్యను అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోని విద్యార్థులకు పోషకాహార బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలు అమలు చేస్తుండడంతో పేద విద్యార్థులు ఆటంకాలు లేకుండా ఉన్నత విద్యను పూర్తి చేసే అవకాశాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను ప్రవేశపెట్టడం రాష్ట్ర విద్యా రంగంలో కీలకమైన సంస్కరణ. 2026- 27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం సంవత్సరానికి సుమారు రూ. 180 కోట్ల వ్యయం చేయనున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితమైన పోషకాహార పథకాలను ఇప్పుడు ఇంటర్మీడియట్ స్థాయికి కూడా విస్తరించడం ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనం. ఇంటర్మీడియట్ దశలో పెరుగుతున్న డ్రాప్‌అవుట్లను తగ్గించడం, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం, పోషకాహార లోపాలను నివారించడం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై విద్యార్థుల విశ్వాసాన్ని పెంపొందించడం, పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడం వంటి బహుముఖ లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు సరైన ఆహారం తీసుకోకుండానే ఉదయం పూట కళాశాలలకు హాజరవుతున్నారని పలు అధ్యయనాలు వెల్లడైంది. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల్లో ఏకాగ్రత లోపించడంతో చదువులో రాణించలేకపోతున్నారు. పడికడుపుతో ఆరోగ్య పరిస్థితులు కూడా వారికి ప్రతికూలంగా మారుతున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ కడుపుతో విద్యార్థి చదువు కొనసాగించడం సాధ్యం కాదనే అనే భావనతో ప్రభుత్వం ఈ బృహత్ కార్యక్రమానికి రూపకల్పన చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. దీంతో పాఠశాల స్థాయిలో డ్రాప్‌అవుట్లు కొంత మేర నియంత్రణలో ఉంటున్నాయి. అయితే పదో తరగతి తర్వాత పరిస్థితి మారిపోతుంది. ఇంటర్మీడియట్ దశలో విద్యార్థులు ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, ఇతర విద్యా అవసరాలకోసం అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుంది. అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లలను చదువు మాన్పించి ఉపాధి వైపు మళ్లిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, సామాజికంగా వెనుకబడిన వర్గాల్లో, బాలికల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. అందువల్ల హైస్కూల్ స్థాయితో పోలిస్తే ఇంటర్మీడియట్ దశలో విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపేస్తున్న ప్రమాదం ఎక్కువగా ఉందని పలు విశ్లేషణల్లో తేలింది. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్‌గా ఇటీవల రాజీనామా చేసిన అకునూరి మురళి పలు సందర్భాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం విద్యను కేవలం తరగతి గదులకు పరిమితం చేయకుండా, విద్యార్థుల సంపూర్ణ అభివద్ధికి అవసరమైన పోషకాహారం, కౌన్సెలింగ్, మౌలిక సదుపాయాలు, సురక్షిత విద్యా వాతావరణం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల డ్రాపవుట్స్‌ను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక, సామాజిక మద్దతు అవసరమని తెలిపారు. ఈ ఆలోచనలకు అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గురుకుల, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచిత వసతి, పోషకాహారం, పర్యవేక్షణ, క్రమబద్ధమైన అధ్యయన వాతావరణం లభిస్తాయి. ఈ కారణంగా గురుకుల విద్యాసంస్థల్లో డ్రాప్‌అవుట్లు సాధారణంగా తక్కువగా ఉండటమే కాకుండా, ఇంటర్మీడియట్ ఫలితాల్లో కూడా మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తున్నారు. గురుకులాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి ప్రధాన కారణాల్లో ఒకటి వారికి అందుతున్న నాణ్యమైన ఆహారం, నివాస సదుపాయాలు, నిరంతర పర్యవేక్షణ. దీన్ని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా ఆహార భద్రతను కల్పించడం ద్వారా పేద విద్యార్థులకు ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వంపై గణనీయమైన ఆర్థిక భారం పడుతున్నా, ప్రభుత్వం దీన్ని వ్యయంగా కాకుండా మానవ వనరులపై పెట్టుబడిగా పరిగణిస్తోంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం కోసం సంవత్సరానికి సుమారు రూ. 180 కోట్ల వరకు ఖర్చు కానుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు ఈ పథకం పరిధిలోకి రానున్నారు. అంటే ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి సగటున రూ. 9 వేల వరకు, నెలకు సుమారు రూ. 750 వరకు ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్ర బడ్జెట్ పరంగా చూస్తే ఇది అదనపు భారం అయినప్పటికీ, విద్యార్థుల డ్రాప్‌అవుట్లను తగ్గించడం, పోషకాహార లోపాలను నివారించడం, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలను పెంచడం, భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలతో పోలిస్తే ఈ వ్యయం సమర్థనీయమైనదే. విద్యార్థి మధ్యలో చదువు మానేయడంవల్ల ఆ కుటుంబం, సమాజం, ప్రభుత్వంపై పడే సామాజిక, ఆర్థిక భారం కంటే ఇప్పుడు పడుతున్న ఆర్థిక భారం ఎక్కువేమీ కాదు. విద్యార్థులకు సమతుల్య పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించింది. విద్యార్థులకు రోజువారీ అవసరమైన శక్తి, ప్రోటీన్లు లభించేలా మెనూ ఉంది. వారికి దోసె, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, బోండా, పూరీ, చట్నీ, సాంబార్, కూరలు, పాలు, రాగి మాల్ట్ వంటి ఆహార పదార్థాలను అందించనున్నారు. పోషకాహార లోపాలను తగ్గించడమే కాకుండా విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మొత్తంగా చూస్తే తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇంటర్మీడియట్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కేవలం సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదు. ఇది విద్యార్థుల ఆరోగ్యం, డ్రాపవుట్స్ నివారణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం, సామాజిక సమానత్వం వంటి అనేక లక్ష్యాలను కలగలిపిన సమగ్ర విద్యా సంస్కరణ. పదో తరగతి తర్వాత చదువు మానివేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్న వేలాది మంది పేద విద్యార్థులకు ఈ కార్యక్రమం ఒక భరోసాగా నిలిచే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెరగడం, హాజరు శాతం మెరుగుపడడం, డ్రాపవుట్స్ తగ్గడం, విద్యార్థుల ఫలితాలు మెరుగుపడడం వంటి సానుకూల ఫలితాలు కనిపిస్తే తెలంగాణ విద్యా రంగంలో ఇది ఒక మైలురాయిగా నిలిచే అవకాశముంది.

# బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా?

**దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సే**

**మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశాం**

**మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు**

**మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ**

**మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన**

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్,

మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ



బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపవుట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**ఇండస్ట్రియల్ హబ్‌గా వెలుగొందుతున్న జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలి**

**రైతులను క్రాప్ డైవర్షన్, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలి**

**ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి**

**-- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**

**గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ విద్య వైపు ప్రోత్సహించాలి**

**ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య మౌలిక వసతులు కల్పించాలి**

**-- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**

జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కార్మిక, ఎంప్లాయిమెంట్ శాఖ మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రవాణా, ఆర్ అండ్ బి, పిసిబి, పి ఆర్, విద్యుత్, డి ఆర్ డి ఏ, సంక్షేమ శాఖలు, ఆర్టీసీ, షుగర్ కేన్, పరిశ్రమలు, తదితర రంగాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లా మరింత పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహిస్తూ, లాభదాయక పంట అయిన ఆయిల్ పామ్ సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, గూడు లేని పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో గతంలో నిర్మించి కేటాయించని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల మేరకు నీటి నిల్వలను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన మౌలిక వసతులపై నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన బడ్జెట్



కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. జాతీయ రహదారి- -65 పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ కార్మికుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. హాస్పిటళ్లు, హోటళ్లు తదితర సంస్థల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చేరడం ముఖ్యమని అన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన బోర్‌వెల్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని డయాగ్నస్టిక్ పరికరాలు, డ్రగ్స్, అవసరమైన ఇక్యుమెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సేవలకు అవసరమైన చోట అదనపు పడకల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నర్సింగ్ కళాశాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నర్సింగ్ వృత్తికి ప్రస్తుతం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉన్నందున గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 35 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన డ్రైవర్ల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీలు , ఎమ్మెల్సీ, శాసనసభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ సురేష్ శేఖర్ రైతు సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎంపీ రఘునందన్ రావు ప్రజలు మోసపోకుండా ఏ సర్వే నంబర్లు ఏ భూమి ఉందో తెలిసేలా వెబ్సైట్లో పెట్టాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుల ప్రాణాలు కాపాడి అమరుడైన అనురూప్..

### స్వగ్రామం కవాడిపల్లికి చేరిన భౌతికకాయం




అమెరికాలో తోటి స్నేహితులను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన కోడూరు అనురూప్ రెడ్డి మృతదేహం పది రోజుల తర్వాత స్వగ్రామానికి చేరుకోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం అలుముకుంది. కవాడిపల్లికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడైన అనురూప్ రెడ్డి ఉన్నత చదువుల కోసం రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసి, మరో వారంలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఈ తరుణంలో గత నెల 30వ తేదీన అనురూప్ తన స్నేహితులతో కలిసి లూసియానా రాష్ట్రంలోని టోరోడో పార్కు వద్ద ఉన్న సెబాన్ నది వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు ముగ్గురు స్నేహితులు నీట మునిగి పోతుండగా గమనించిన అనురూప్, ఏమాత్రం వెనుకాడకుండా వెంటనే నీటిలోకి దూకి తన సమయస్ఫూర్తితో ముగ్గురినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. అయితే, తాను ఒడ్డుకు వస్తున్న సమయంలో నదిలో వేసిన ఒక వల అతడి కాళ్లకు చుట్టుకోవడంతో, అందులోంచి బయటపడే క్రమంలో నీట మునిగి దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. చేతికందిన కొడుకు ప్రయోజకుడై ఉన్నత స్థాయిలో స్థిరపడతాడనుకున్న ఆ తల్లిదండ్రులకు ఈ మరణవార్త తీవ్ర గర్భశోకాన్ని మిగిల్చింది. స్వగ్రామానికి చేరుకున్న కొడుకు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.ముగ్గురు మిత్రులను మృత్యుముఖం నుంచి రక్షించి, తాను మాత్రం విగతజీవిగా మారిన ఆ యువకుడి భౌతికకాయానికి భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తోటి వారి కోసం ప్రాణాలర్పించిన అనురూప్ సమయస్ఫూర్తికి, సాహసానికి గుర్తింపుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా పంపిన కమెండేషన్ లెటర్‌ను ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ముగ్గురిని కాపాడిన అనురూప్ తన ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని, అతని ప్రాణత్యాగం ఎప్పటికీ గుర్తుండిపోతుందని వారు కొనియాడారు. అనురూప్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండి, తగిన సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ హృదయ విదారక ఘటనతో కవాడిపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల పరిసరాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఏసీబీ వలలో ఆర్ అండ్ బి ఈఎన్సీ మోహన్ నాయక్



ఆదాయానికి మించిన ఆస్తులు ఆరోపణల నేపథ్యంలో రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీ మోహన్ నాయక్ ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. మియాపూర్లో ఉన్న మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన కార్యాలయాలు, బంధువులు, అత్యంత సన్నిహితుల ఇళ్లలో మొత్తం 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన ఈ తనిఖీల్లో భారీగా ఆస్తి పత్రాలు, నగదు, కీలక డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆర్ అండ్ బీ శాఖలో అత్యంత కీలకమైన స్థానంలో ఉన్న ఉన్నతాధికారి ఇల్లే లక్ష్యంగా ఈ స్థాయిలో దాడులు జరగడం అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

# 47 ఏండ్ల నిషేధం ఎత్తివేత.. లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్



ముస్లింలు అధికంగా నివసించే కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో ఆల్కహాల్ అమ్మకాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా గత 47 ఏండ్లుగా కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ మేరకు 1979లో అమల్లోకి వచ్చిన 'లక్షద్వీప్ ప్రొహిబిషన్ రెగ్యులేషన్'ను రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నియంత్రిత విధానంలో లైసెన్స్ పొందిన దుకాణాల ద్వారా మద్యం విక్రయాలకు మార్గం సుగమమైంది.కొత్తగా అమల్లోకి వచ్చిన లక్షద్వీప్ ఎక్సైజ్ రెగ్యులేషన్ 2026 ప్రకారం మద్యం తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, కొనుగోలు, విక్రయాలు, వినియోగం వంటి అంశాలు అన్నింటినీ లైసెన్సింగ్ వ్యవస్థ ద్వారా నియంత్రించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు కూడా మద్యం దిగుమతి, రిటైల్ విక్రయాలకు అనుమతి పొందే వెసులుబాటు కల్పించింది.

**భారీగా పన్నులు..**

అయితే మద్యం అందుబాటులోకి తెస్తున్నప్పటికీ అధిక పన్నులు విధించారు. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, విదేశీ మద్యంపై 400 శాతం, బీర్లపై 200 శాతం, వైన్‌పై 80 శాతం వరకు ఎక్సైజ్ సుంకం విధించారు. అలాగే 21 ఏండ్లలోపు వారికి మద్యం విక్రయించడంపై నిషేధం ఉంచారు. అవసరమైతే లక్షద్వీప్‌లోని ఏదైనా ప్రాంతంలో మళ్లీ నిషేధం విధించే అధికారం అడ్మినిస్ట్రేటర్‌కు ఉంటుంది.

**లక్షద్వీప్‌లో మద్యంపై నిషేధం ఎందుకు?**

లక్షద్వీప్‌లో సుమారు 97 శాతం జనాభా ముస్లింలే. భారతదేశంలోని ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంతో పోల్చినా ఇది చాలా అధికం. ఇస్లాం మతంలో మద్యపానాన్ని నిషేధించిన నేపథ్యంలో 1979 నుంచి లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలపై నిషేధం అమలు చేశారు. అయితే ఈ నిషేధం పూర్తిస్థాయిలో లేదు. పర్యాటకులు, ప్రభుత్వ అధికారుల కోసం కొన్ని మినహాయింపులు ఉండేవి. కానీ లక్షద్వీప్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మద్యపానంపై నిషేధాన్ని ఎత్తివేసింది. మాల్దీవులు వంటి సముద్ర ద్వీప పర్యాటక కేంద్రాలతో పోటీ పడాలంటే నిషేధం అడ్డంకిగా మారుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# భారత రాజకీయ చరిత్రలో అజేయ శకం: నెహ్రూ సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టిన ప్రధాని నరేంద్ర మోదీ

భారత రాజకీయ చరిత్రలో జూన్ 9, 2026 ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబడింది. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం, 2014 మే 26వ తేదీన దేశ ప్రధానిగా తన తొలి ప్రస్థానాన్ని ప్రారంభించిన నరేంద్ర మోదీ, నేడు ఎవరికీ అందనంత అత్యంత అరుదైన చారిత్రక మైలురాయిని చేరుకున్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఏకైక ప్రధానమంత్రిగా ఆయన సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట దశాబ్దాలుగా పదిలంగా ఉన్న రికార్డును ప్రధాని మోదీ బద్దలు కొట్టారు. జూన్ 9 నాటికి ప్రధాని పదవిలో ఆయన విజయవంతంగా 4,398 రోజులను పూర్తి చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించడం దేశవ్యాప్తంగా విశేష చర్చనీయాంశమైంది.ఒక సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నరేంద్ర మోదీ దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన తీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. 2014లో తొలిసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, తన వినూత్న విధానాలతో ప్రజల మన్ననలు పొందారు. ఆ నమ్మకంతోనే 2019 సార్వత్రిక ఎన్నికల్లో మరింత భారీ మెజారిటీతో రెండోసారి ఆయనకు ప్రజలు పట్టం కట్టారు.ఆ తర్వాత జరిగిన పరిణామాల మధ్య ముచ్చటగా మూడోసారి గెలుపొంది, 2024 జూన్ 9న ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నెహ్రూ రికార్డును బద్దలు కొట్టే దిశగా అడుగులు వేశారు. నేటితో అనగా 2026 జూన్ 9 నాటికి ఆయన మూడో విడత పాలనలోకి అడుగుపెట్టి సరిగ్గా రెండేళ్లు పూర్తికావడంతో పాటు, ప్రధానిగా పుష్కర కాలాన్ని (12 ఏళ్లు) ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయడం భారతీయ ప్రజాస్వామ్యానికే ఒక మచ్చుతునకగా నిలిచింది. అధికారంలోకి వచ్చి పన్నెండు సంవత్సరాలు పూర్తయిన ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా దేశ ప్రజలతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. తమ ప్రభుత్వపు గత పన్నెండేళ్ల పాలన కేవలం అధికార పీఠాన్ని అనుభవించడం కోసం కాదని, అది దేశ ప్రజల విశ్వాసం,



సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితమైన తపస్సు అని ఆయన అభివర్ణించారు. 140 కోట్ల దేశ ప్రజల అండదండలు, ఆశీస్సులతో, దేశమే ప్రథమం అనే ఏకైక స్ఫూర్తితోనే తమ ప్రయాణం సాగిందని ఆయన ఉద్ఘాటించారు. దేశ ప్రగతికి అసలైన చోదక శక్తులైన యువత, మహిళలు, శ్రామికులు, రైతన్నలకు సాధికారత కల్పించడంలో తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేసిందని ప్రధాని స్పష్టం చేశారు. అలాగే, 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారతదేశం) అనే మహోన్నత సంకల్పాన్ని సాకారం చేసుకునేందుకు సేవ, సుపరిపాలన, శ్రేయస్సు అనే మార్గంలో మరింత వేగంగా ముందుకు సాగుతూనే ఉంటామని ఆయన దేశ ప్రజలకు భరోసా ఇచ్చారు.గడిచిన ఈ పన్నెండేళ్ల మోదీ హయాంలో భారతదేశం మున్నెన్నడూ చూడని విధంగా ఆర్థిక, సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధించింది. ముఖ్యంగా డిజిటల్ విప్లవంలో భారత్ సాధించిన అపూర్వ విజయం ప్రపంచ దేశాలను సైతం ఆశ్చర్య పరిచింది. యూపీఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సాంకేతిక ఆవిష్కరణలతో ప్రపంచానికి మన దేశం సరికొత్త పాఠాలు నేర్పింది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో వెనుకబడి ఉన్నట్లుగా పరిగణించబడిన భారత్, నేడు గ్లోబల్ లీడర్‌గా, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా ఎదిగింది. అంతర్జాతీయ వేదికలపై భారతదేశం తీసుకునే నిర్ణయాలు, చూపే చొరవ నేడు ప్రపంచ గమనాన్ని శాసించే స్థాయికి చేరుకున్నాయి. సువిశాల రోడ్లు, రైల్వే నెట్‌వర్క్ విస్తరణ, రక్షణ రంగంలో స్వావలంబన వంటి ఎన్నో మైలురాళ్లు ఈ పన్నెండేళ్లలో సాకారమయ్యాయి.తనదైన నాయకత్వ పటిమతో, మొక్కవోని దీక్షతో పుష్కర కాలం పాటు నిరంతరాయంగా దేశాన్ని నడిపించిన ప్రధాని మోదీ ప్రయాణం ఆధునిక భారత రాజకీయాల్లో ఎప్పటికీ నిలిచిపోయే ఒక సువర్ణ అధ్యాయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చారిత్రక ఘట్టం పట్ల దేశవ్యాప్తంగా నెటిజన్లు, రాజకీయ విశ్లేషకులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# పారిశ్రామికవేత్తల కృషి అభినందనీయం..

## పెట్టుబడులకు తెలంగాణే గమ్యస్థానం




హైదరాబాద్ వేదికగా ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2026 ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొని పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు మరియు వ్యాపార దిగ్గజాలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో, ఆర్థిక ఎదుగుదలలో పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశ్రమల అధినేతలు చూపుతున్న చొరవ, వారు సాధిస్తున్న విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.పరిశ్రమల స్థాపన, నూతన ఆవిష్కరణలు, భారీ పెట్టుబడుల ఆకర్షణతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పూర్తి మద్దతునిచ్చే పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ వ్యాపార, వాణిజ్య సంస్థలకు తెలంగాణ రాష్ట్రాన్ని ఎప్పటికీ మొదటి ఎంపికగా నిలబెట్టే దిశగా తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా వ్యాపారవేత్తలకు ప్రభుత్వ పెద్దలు భరోసా కల్పించారు.వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్న విజేతలందరికీ వారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో అసాధారణ ప్రతిభను గుర్తించి, రాబోయే తరాలకు, భవిష్యత్ ప్రగతికి మరింత స్ఫూర్తినిచ్చేలా ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర పురోగతికి ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతో అవసరమని వారు ఉద్ఘాటించారు.

# జనగణనలో భారీ సంఖ్యలు.. 4 కోట్లు దాటిన తెలంగాణ జనాభా?

రాష్ట్రంలో జనాభా నాలుగు కోట్లకు పైగానే ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం జనగణన హౌస్ లిస్టింగ్సర్వే నడుస్తుండగా.. జూన్ 9వ తేదీతో సర్వే పూర్తి చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో దాదాపుగాఇప్పటివరకు రాష్ట్రంలో దాదాపుగా కోటి ఇళ్లల్లో జనగణన అధికారులు హౌస్లిస్టింగ్సర్వే పూర్తిచేశారు. ఇందులో దాదాపుగా 4 కోట్ల జనాభా ఉందని లెక్కలు వేశారు. మరో 2 లక్షల ఇండ్లల్లో జనగణన సర్వే చేసి వివరాలు సేకరించాల్సి ఉందని అంచనా వేస్తున్నారు. నాలుగు వారాల సర్వేలో భాగంగా వారానికి దాదాపుగా 20 లక్షల ఇళ్ల చొప్పున యజమానుల వివరాలు సేకరించారు. మొదట్లో మ్యాపింగ్, ఆ ప్రాంతంపై అవగాహన, యాప్లో సాంకేతిక సమస్యల కారణంగా మొదటి మూడు, నాలుగు రోజులు సర్వే కొద్దిగా నెమ్మదిగా సాగింది. ఆ తర్వాత వేగం పుంజుకుంది. జూన్ 9తో సర్వేను దాదాపు పూర్తి కావచ్చింది.

**జనగణన, ఓటరు మ్యాపింగ్ ఒకేసారి..**

గ్రామీణ ప్రాంతాల్లో హౌస్లిస్టింగ్ సర్వేలో ఎలాంటి సమస్య లేకపోయినా పట్టణ ప్రాంతాల్లోనే సమస్యలు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నందున అనేక మంది తీర్థయాత్రలు,విహారయాత్రలు, వ్యక్తి గత పనులు,గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్టు గుర్తించారు. అనేక ఇళ్లకు తాళాలు వేసి ఉన్నందున ఇబ్బందులు వస్తున్నాయనిసిబ్బంది చెబుతున్నారు. ఒకే ఇంటికి రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తుందని, ఇంట్లో ఎవరూ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హైదరాబాద్లో అంచనా వేసిన దాని కంటే ఎక్కువ సంఖ్యలోనే ఇళ్లు ఉన్నాయని.. కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పెద్ద ఎత్తున రావడంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోందని అధికారులు పేర్కొన్నారు.మరోవైపు రాష్ట్రంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఎండలకు ప్రజలు అల్లాడు తున్నారు. అనేక మంది వడదెబ్బతో చనిపోతున్నారు. సర్వే చేసే సిబ్బంది సైతం ఎండలో తిరగలేక ఉదయం, సాయంత్రం వేళల్లో తమ పనిని ముగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.పట్టణాల్లో విద్యావంతులు ఉన్నా సిబ్బందికి సరిగా సహకరించడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి.సహాయ నిరాకరణ చేయడం, అనేక యక్ష ప్రశ్నలు వేసి సిబ్బందిని విసిగిస్తున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో ఓటరు జాబితా ప్రక్షాళన మ్యాపింగ్సైతం చేశారు.కొన్నిచోట్ల జనగణన,మరోవైపు ఓటరు మ్యాపింగ్ ఒకేసారి జరుగు తుండటంతో ఎవరు ఏ అధికారి అని తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నట్టు సమాచారం. ఓటరు మ్యాపింగ్ఎధికారులు వారికి సంబంధించిన వ్యక్తుల వివరాలు, ధ్రువపత్రాలు కూడా అడుగు తుండటంతో కొంత గందరగోళానికి గురవుతున్నారు. పూర్తి అవగాహన లేకపోవడంతో వల్ల కొంత ఆందోళనకు కూడా గురైనట్టు సమాచారం.

**సర్వేల్లో తేడాలు..**

గతంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేసినప్పుడు 1.15 కోట్ల కుటుంబాలను గుర్తించారు. నాడు మొత్తం జనాభా 3.50 కోట్లుగా తేలింది. కానీ, కొందరు సర్వేలో పాల్గొనలేదు. ప్రస్తుత జనగణనలో మాత్రం అంత కంటే తక్కువ సంఖ్యలోనే ఇళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బీసీ గణనలో ప్రభుత్వ పథకాల కోసం కలిసి ఉన్న కుటుంబాలు సైతం విడివిడిగా వివరాలు నమోదు చేసుకున్నాయి. జనగణనకు వచ్చే సరికిమాత్రం అందరూ తక్కువ కుటుంబాలను చూపుతున్నట్టు తెలుస్తోంది. దీంతో కుటుంబాల సంఖ్య తక్కువగా, జనాభా సంఖ్య ఎక్కువగా ఉంటోందని క్షేత్రస్థాయి జనగణన అధికారులు చెబుతున్నారు. 1.15 కోట్లకు కొంచెం అటు ఇటుగా కుటుంబాలు ఉంటాయని, జనాభా మాత్రం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా కోటి వరకు ఇళ్ల సర్వే పూర్తయిందని, హైదరాబాద్ మహానగరంలో మాత్రం ఇళ్ల సంఖ్య పెరిగే చాన్స్ ఉందని, గేటెడ్కమ్యూనిటీ లోనూ కొందరు బీసీ గణనకు సహకరించలేదని.. కానీ, ప్రస్తుతం జనగణనకు ప్రజలంతా సహక రిస్తున్నందున ఎక్కువ సంఖ్యలో ఇళ్లు నమోదయ్యే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.



# బుధవారంపేటలో వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09



రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వాటర్ ప్లాంట్‌ను మంగళవారం పునఃప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కన్నూరి రవీందర్, మండల ఎంపీవో సమ్మిరెడ్డి, డీసీసీ కార్యదర్శి బుద్ధార్థి బుచ్చన్న పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్లాంట్‌ను ప్రారంభించారు.సుమారు 15 సంవత్సరాల క్రితం వరంగల్ డయాసిస్ సాంగిక సేవా సంస్థ, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ యంత్రాంగం ఇటీవల కాలంలో దెబ్బతినడంతో సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి ప్లాంట్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.గ్రామ ప్రజలందరూ శుద్ధమైన తాగునీటిని వినియోగించుకోవాలని, ఆరోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన నీటి పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుద్ధార్థి విజయ, ఏఎంసీ డైరెక్టర్ ఆరెల్లి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు బావు స్వరూప కత్తెరసాల, బైరెడ్డి అనూష సతీష్, కన్నూరి రాకేష్, పుదరి శ్రీనివాస్, మరుకు చంద్రశేఖర్, కన్నూరి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి చొప్పరి రాకేష్, పెంద్రు సుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరణానంతరం ఇద్దరికి వెలుగునిచ్చిన కెక్కెర్ల రాజయ్య

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09





రామగిరి మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన కెక్కెర్ల రాజయ్య మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రాజయ్య మరణానంతరం ఆయన నేత్రాలను సదాశివ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో విజయవంతంగా సేకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఒక వ్యక్తి మరణానంతరం చేసిన నేత్రదానం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపగలదని తెలిపారు. సమాజంలో నేత్రదానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.నేత్రదానానికి సహకరించిన మృతుని కుమారుడు కెక్కెర్ల రాజకుమార్, కోడలు రమాదేవి, కుమార్తెలు బొల్లెపల్లి పద్మ, వేముల విజయలక్ష్మి, మోత్కూరి స్వర్ణలత, వడ్లకొండ సునీతలను పలువురు అభినందించారు. వారి నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రధాన కార్యదర్శి తోట చంద్రయ్య, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, డీసీసీ కార్యదర్శి బుద్ధార్థి బుచ్చయ్య పటేల్, మాజీ ఎంపీపీ కొరకొప్పుల నీరజ తులసీరాం, మాజీ ఎంపీటీసీ సభ్యులు ముస్త్యాల శ్రీనివాస్, కాళేశ్వర దేవస్థాన కమిటీ సభ్యులు కాటం సత్యం, రామగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కూరి అవినాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సదాశివ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని మృతునికి ఘనంగా నివాళులర్పించారు. నేత్రదానం వంటి మహోన్నత సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని, ప్రతి ఒక్కరూ ఇలాంటి దాన కార్యక్రమాలకు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

# ఎల్ఈడీ అధిక ప్రకాశం లైట్ల వినియోగాన్ని నివారించాలి : లింగం రాజయ్య

అర్జున్ సమాచారం జూన్ 09 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:





అధిక ప్రకాశం గల ఎల్ఈడీ లైట్ల వినియోగం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని, వాహనదారులు అలాంటి లైట్లను ఉపయోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అర్జున్ సమాచారం ఎడిటర్ లింగం రాజయ్య పిలుపునిచ్చారు. రాత్రి వేళల్లో వాహనాలకు అమర్చిన అధిక వెలుతురు కలిగిన ఎల్ఈడీ లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ లైట్ల కారణంగా క్షణిక కాలం పాటు చూపు మందగించి, రహదారిపై పరిస్థితులు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, రాత్రి సమయంలో ప్రయాణించే ప్రజలు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శక్తి గల లైట్లను అమర్చడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.వాహన యజమానులు ప్రమాణాలకు అనుగుణమైన లైట్లను మాత్రమే వినియోగించాలని, అవసరం లేని సమయంలో హైబీమ్ లైట్లను ఉపయోగించరాదని సూచించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లింగం రాజయ్య కోరారు.ప్రజల ప్రాణాల భద్రతే ముఖ్యమని, అధిక ప్రకాశం గల ఎల్ఈడీ లైట్ల వినియోగాన్ని స్వచ్ఛందంగా తగ్గించాలని లింగం రాజయ్య విజ్ఞప్తి చేశారు.

# జీతాలు ఇవ్వకుండా వేధింపులు.. కాంగ్రెస్ సర్కార్‌కు అంగన్ వాడీల ఉసురు తగులుతుంది : హరీశ్ రావు

రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల అంగన్ వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా..? నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్ వాడీలను వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుందన్నారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు.మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి.. ముందు అంగన్ వాడీలకు జీతాలు చెల్లించి, మహిళల పట్ల నీకున్న గౌరవాన్ని నిలబెట్టుకో అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు.రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల అంగన్ వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా..? నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్ వాడీలను వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుందన్నారు. మహిళా మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.అంగన్ వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్ వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారు. వారి గౌరవాన్ని పెంచారు.2014 నాటికి అంగన్ వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్నిరూ.7,800లకు, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారన్నారు.



# చిన్నారుల ఆరోగ్య రక్షణే లక్ష్యం: సర్పంచ్ చిందం మహేష్



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09

రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లె ప్లాట్‌లో ఉన్న ఉప్పర్ల కేశారం--1 అంగన్‌వాడీ కేంద్రాన్ని పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవలు, పోషకాహార కార్యక్రమాల అమలును పరిశీలించి అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడి కేంద్రం నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) పంపిణీ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పాలు, గుడ్లు, బాల అమృతం, యూనిఫాంలను పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, మెరుగైన పోషకాహారం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హ లబ్ధిదారునికి చేరేలా కృషి చేయాలని చిందం మహేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇసారపు మంజుల, ఆయా తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 15 నుంచి తెలంగాణలో మద్యం ధరల పెంపు అవకాశం




పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09

తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ నివేదిక మేరకు జూన్ 15 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. ముడిసరుకులు, ప్యాకేజింగ్, రవాణా ఖర్చులు పెరగడంతో మద్యం ధరలను 10 నుంచి 15 శాతం వరకు పెంచాలని కమిటీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కమిటీ ప్రతిపాదనల ప్రకారం సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిళ్లపై రూ.80 వరకు, ప్రీమియం బ్రాండ్లపై రూ.90 వరకు ధరలు పెరగవచ్చు. కాస్ట్లీ, సూపర్ ప్రీమియం బ్రాండ్లపై రూ.120 వరకు పెరుగుదల ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. మద్యం తయారీ సంస్థలు బీర్ల ధరలను కూడా పెంచాలని కోరినప్పటికీ, గతంలోనే ధరలు సవరించిన కారణంగా ఈసారి బీర్ల ధరల్లో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్ కిషోర్ జైస్వాల్ నేతృత్వంలోని కమిటీ త్వరలో ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించనుంది. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ధరల పెంపు అమలైతే రాష్ట్ర ఖజానాకు ఏటా వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ధరల పెంపుపై ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# తైక్వాండో నేషనల్ పార్టిసిపెంట్ విష్ణుశ్రీకి డీఈవో అభినందనలు

అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో ఇటీవల (నవంబర్ 26 నుండి డిసెంబర్ 02, 2025 వరకు) జరిగిన 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ తైక్వాండో గర్ల్స్ అండర్--17 (32 కేజీల విభాగం)లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న చేతి విష్ణుశ్రీని నల్గొండ జిల్లా విద్యాశాఖాధికారి (ఇజుూ) పి. సుసీందర్ రావు అభినందించారు. ఎస్ జి ఎఫ్ సెక్రటరీ దగ్గుబాటి విమల ఆధ్వర్యంలో విష్ణుశ్రీ జిల్లా విద్యాశాఖాధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విష్ణుశ్రీని, ఆమె తల్లిదండ్రులను, అలాగే ఆమెకు శిక్షణ ఇచ్చిన మాస్టర్ రాచకొండ శ్రీనివాస్‌ను డీఈవో సుసీందర్ రావు ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# బెల్లంపల్లి నియోజకవర్గంలో పర్యటించిన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్

అర్జున్ సమాచారం జూన్ 09 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో పలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులతో చర్చలు జరిపారు.బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. బూత్ కమిటీలు, సెక్టార్ కమిటీల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బహుజన్ సమాజ్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని చెప్పారు. బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో త్వరలోనే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోయినపల్లి సంతోష్ కుమార్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిలు గోలేటి నారాయణ, గోమాస బ్రహ్మానందం, నియోజకవర్గ అధ్యక్షుడు దాగం శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA




## బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'మైఖేల్'.. ఇప్పుడు ఓటీటీలోకి ఎంట్రీ.. ఎక్కడ చూడొచ్చంటే?

ఈ ఏడాది హాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన చిత్రాల్లో 'మైఖేల్' ఒకటి. ప్రపంచ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేసిన పాప్ లెజెండ్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ బయోపిక్ విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొల్పింది. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాన్ని అందుకుంది. మైఖేల్ జాక్సన్ పాత్రలో ఆయన మేనల్లుడు జాఫర్ జాక్సన్ నటించడం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మైఖేల్ స్టేజ్ ప్రెజెన్స్, డ్యాన్స్ స్టైల్, హావభావాలను జాఫర్ అద్భుతంగా ప్రదర్శించాడని ప్రేక్షకులు, విమర్శకులు ప్రశంసించారు. ప్రముఖ దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ చిత్రం మైఖేల్ జాక్సన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను, ఆయన సంగీత ప్రయాణాన్ని, ప్రపంచవ్యాప్తంగా ఆయన సాధించిన అపారమైన ఖ్యాతిని తెరపై ఆవిష్కరించింది.





## పెద్ది'లో జాన్వీ పాత్రపై వివాదం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'పెద్ది' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ క్రమంలో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల వర్షం కురుస్తుంది. అయితే సినిమా విజయోత్సాహం మధ్య ఓ వివాదం మాత్రం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా సినిమాలో జాన్వీ కపూర్ పోషించిన 'అచ్చియమ్మ' పాత్రను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

పెద్ది'లో జాన్వీ పాత్రపై వివాదం..

జయా బచ్చన్, కరీనా ఘాటు వ్యాఖ్యలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'పెద్ది' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ క్రమంలో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల వర్షం కురుస్తుంది. అయితే సినిమా విజయోత్సాహం మధ్య ఓ వివాదం మాత్రం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా సినిమాలో జాన్వీ కపూర్ పోషించిన 'అచ్చియమ్మ' పాత్రను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సినిమాలో జాన్వీ పాత్రకు అవసరానికి మించి గ్లామర్ ట్రీట్‌మెంట్ ఇచ్చారని, కొన్ని సన్నివేశాల్లో ఆమె వ్యక్తిత్వం కంటే శరీర సౌందర్యానికే ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా కెమెరా యాంగిల్స్, కొన్ని విజువల్స్ మహిళా పాత్రను కేవలం గ్లామర్ కోణంలోనే ప్రెజెంట్ చేశాయంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

## కోనసీమలో కొత్త మలుపు



'నా తొలి సినిమా 'సర్కారు నౌకరి' పీరియడ్ డ్రామా అయితే.. ఈ రెండో సినిమా 'కొత్త మలుపు' రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇందులో ఎమోషన్స్‌తో పాటు కథను ముందుకు నడిపించే ఆసక్తికరమైన సస్పెన్స్ కూడా ఉంటుంది' అంటున్నారు గాయని సునీత తనయుడు, యువ నటుడు ఆకాష్ గోపరాజు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కొత్త మలుపు'. భైరవి అర్ధ్యా కథానాయిక. శివవరప్రసాద్ కేశనకుర్తి దర్శకుడు. తథాస్తు క్రియేషన్స్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రాన్ని మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నది. ఈ నెల 12న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో హీరో ఆకాష్ గోపరాజు మాట్లాడారు. 'కోనసీమ నేపథ్యంలో సాగే రోమ్‌కామ్ లవ్‌స్టోరీ ఇది.తెలుగు వార్తలుఇందులో నాది నేటి యువత ఆలోచనలు, వారి భావోద్వేగాలకు దగ్గరగా ఉండే పాత్ర. చాలా ఎనర్జిటిక్‌గా ఉంటంది. తొలి సినిమా కంటే మెరుగ్గా కనిపించేందుకు, నటించేందుకు ప్రయత్నించాను. ఈ కథలో ఊహించని మలుపులు నన్ను ఆకట్టుకున్నాయి. నేను ఎలాంటి పాత్రనైతే కోరుకున్నానో, సరిగ్గా అలాంటి పాత్రే ఈ సినిమా ద్వారా నాకు దొరికింది. మైత్రీ వారు విడుదల చేయడం వల్ల సినిమాపై జనాల్లో కూడా ఆసక్తి మొదలైంది. ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణులు అంతా ప్రాణం పెట్టి పనిచేశారు. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా ఆకట్టుకుంటాయి. పల్లెటూరి అందాలు, ప్రేమ, నవ్వులు, భావోద్వేగాలు, సస్పెన్స్.. అన్నీ కలగలిసిన కంప్లీట్ మూవీ ఇది' అని తెలిపారు ఆకాష్ గోపరాజు.





## వైవిధ్యమైన కథతో జంగా

త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మి శరత్‌కుమార్ పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'జంగా'. కెవిన్ గడ్డం (శ్రీహరి) దర్శకుడు. రమ్య కిలారి, జయచంద్రనాయుడు నిర్మాతలు. షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. సోమవారం త్రిగుణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులోని విజువల్స్, సౌండింగ్, హీరో లుక్ కొత్తగా ఉన్నాయి.త్రిగుణ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తున్నారు. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ చిత్రం రూపొందుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. శ్రావణ్, మధునందన్, గగన్ విహారి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ సి.దిలీప్, సంగీతం: కృష్ణ సౌరభ్.

## నా కెరీర్‌లోనే రామాయణ ప్రత్యేకం



ప్రస్తుతం దేశంలో రూపొందుతున్న భారీ చిత్రాల్లో అత్యంత భారీ సినిమా ఏది? అనంటే ఠక్కుమని వచ్చే సమాధానం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ పతాకంపై దాదాపు మూడువేల కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. రావణ పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తుండగా, రావణుడి భార్య మండోదరి పాత్రను కాజల్ అగర్వాల్ పోషిస్తున్నట్టు ఇన్నాళ్లూ వార్తలొచ్చాయి.తాజాగా ఈ విషయాన్ని కాజల్ కూడా ధృవీకరించింది. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ 'రామాయణ' గురించి మాట్లాడుతూ "రామాయణ'లో మండోదరిగా నటిస్తున్నాను. నా కెరీర్లో ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం ఇదే ప్రథమం. అందరిలాగే ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అన్నారు కాజల్. రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తొలిభాగం ఈ ఏడాది దీపావళికి విడుదల కానుండగా, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయనున్నారు.

## మహిళా సమాఖ్య ప్రచార బస్సు ప్రారంభోత్సవానికి జైపూర్ మండల మహిళలు




**అర్జున్ సమాచారం జూన్ 08 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**

జైపూర్ మండలం లోని మహిళ సమాఖ్య మహా లక్ష్మీ మండల లోని మహిళల సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య ప్రత్యేక బస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జైపూర్ మండల మహిళా సమాఖ్య సభ్యులు ఉత్సాహంగా బయలుదేరారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు, సభ్యులు మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేయడంలో ఈ ప్రచార బస్సు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పన, ఆర్థిక స్వావలంబన సాధన లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. మహిళల అభివృద్ధే కుటుంబ, సమాజ అభివృద్ధికి పునాది అని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య నాయకులు, గ్రామ సంఘాల సభ్యులు, సీసీలు, వీఓఏలు మరియు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం చేసినందుకే కేసులు పెట్టారు: బీఆర్ఎస్ నాయకులు



**అర్జున్ సమాచారం జూన్ 08 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**

కోటపల్లి మండలం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేసిన బీఆర్ఎస్ నాయకులపై అన్యాయంగా కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులకు కేసులకు సంబంధించిన నోటీసులు అందజేశారు. ఈ కేసుల్లో సర్పంచ్ తోగరు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చందు, మాజీ సర్పంచ్ ఊరటి రాజ్‌కుమార్ యాదవ్, ఆకుదారి చందు, కొండు రాజేష్, తాళ్లపెల్లి బాపు, కోటపల్లి మండల సామాజిక మాధ్యమాల బాధ్యుడు బాపు నాయక్‌ల పేర్లు ఉన్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ప్రజాస్వామ్య పోరాటాలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇలాంటి కేసులు, నోటీసులకు భయపడేది లేదని, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులు సృష్టించినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం మా పోరాటం ఆగదు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు మా ఉద్యమం కొనసాగుతూనే ఉంటుంది" అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సంబంధిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాధనానికి చిల్లు పడుతోందా..? ప్రభుత్వ వాహనాల వ్యవహారంపై పలు అనుమానాలు

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09:**

ప్రభుత్వ శాఖల్లో వినియోగిస్తున్న కొన్ని వాహనాల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నంబర్ ప్లేట్లు లేకుండా లేదా స్పష్టమైన గుర్తింపులు లేకుండా కొన్ని వాహనాలు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో తిరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ వాహనాల నిర్వహణ, అద్దె విధానాలపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మోటార్ వాహనాల చట్టం ప్రకారం ప్రతి వాహనానికి చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ నంబర్, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి అనుమతులు తప్పనిసరి. అయితే కొన్ని శాఖల్లో వినియోగిస్తున్న వాహనాల వివరాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం, నంబర్ ప్లేట్లు స్పష్టంగా కనిపించకపోవడం వంటి అంశాలు సందేహాలకు తావిస్తున్నాయి. మరోవైపు కొందరు అధికారులు లేదా వారి అనుచరులు వ్యక్తిగతంగా కొనుగోలు చేసిన వాహనాలను ప్రభుత్వ అవసరాల కోసం అద్దె వాహనాలుగా చూపిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అద్దె వాహనాల ఎంపికలో టెండర్ నిబంధనలు పాటిస్తున్నారా? యాజమాన్య వివరాలు సక్రమంగా పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ శాఖలు తమ వద్ద వినియోగిస్తున్న వాహనాల పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్లు, అద్దె ఒప్పందాలు,




చెల్లింపుల సమాచారాన్ని బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత శాఖలు, విజిలెన్స్ అధికారులు, రవాణా శాఖ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వాహనాల పేరుతో అక్రమాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు -- ప్రభుత్వ విప్ విజయరమణరావు

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09**



పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 66 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.66,07,656 విలువైన చెక్కులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు తహసీల్దార్ రాముడు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఒకే ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించగా, జూన్ చివరి నాటికి మరో 2,000 ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మృగశిర కార్తె ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఆలస్యం చేయకుండా నార్లు పోసుకోవాలని సూచించారు. తక్కువ వ్యవధిలో పండే వరి రకాలను ఎంచుకోవాలని, ఆలస్యం చేస్తే దిగుబడి తగ్గే అవకాశముందని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, మొక్కజొన్న, కందులు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నాయని, వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాముడు, ఎంపీడీవో దివ్యదర్శన్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి కేసు గడువులోపు పూర్తి చేయాలి

## నేర నియంత్రణలో సాంకేతికత కీలకం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09**

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారుల మే నెల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీసు సిబ్బంది



పనితీరును సమగ్రంగా సమీక్షించారు. నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కమిషనర్, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసును నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు



చేపట్టాలని సూచించారు. దర్యాప్తులో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అవసరమైతే న్యాయ సలహా తీసుకుని దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆస్థి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాల కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళలకు సంబంధించిన తీవ్రమైన కేసుల్లో నిందితుల అరెస్టులను ఆలస్యం చేయరాదని, గ్రేవ్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులు వంటి కీలక కేసులను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, చిన్నచిన్న నేరాలపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదులు, సీసీసీ పిటిషన్ల విచారణలో క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించి పారదర్శకంగా వ్యవహరించాలని, దర్యాప్తు ప్రక్రియను పూర్తిగా నమోదు చేసిన అనంతరమే కేసులు నమోదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరినీ అనవసరంగా పిలవరాదని, అరెస్టుల విషయంలో ఎస్ఓపీని కచ్చితంగా పాటించాలని చెప్పారు. పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని, విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వవద్దని హెచ్చరించారు. ప్రతి ఎస్‌హెచ్ఓ, సీఐ స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. వాహనాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు అప్రమత్తతతో వ్యవహరిస్తూ రక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ సిబ్బందితో మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి నేరాల దర్యాప్తు, నేరస్థుల గుర్తింపు, కేసుల నిర్వహణలో పారదర్శకత, వేగాన్ని పెంచాలని సూచించారు. ప్రతి డేటా ఫీల్డ్‌ను రియల్ టైమ్‌లో నవీకరించాలని, ఎఫ్ఐఆర్‌లు, నేర వివరాలు, సీడీ పార్ట్స్, అరెస్టు వివరాలు, ఫారం-54, శాస్త్రీయ ఆధారాలు, చార్జ్‌షీట్లు వంటి సమాచారాన్ని నిర్ణీత సమయంలో అప్డేట్ చేయాలని ఆదేశించారు. తప్పుడు లేదా అనవసర సమాచారాన్ని అప్లోడ్ చేయరాదని హెచ్చరించారు. సీసీటీఎన్ఎస్‌లో డేటా అప్లోడ్ పెండింగ్ లేకుండా పనిచేసే సిబ్బందికి రివార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సభలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 09**

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ, డివిజన్, వార్డు సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్లకు సంబంధించిన డివిజన్ సభను లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్ సంపత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ, డివిజన్, వార్డు సభలను నిర్వహిస్తూ పారిశుధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ, అరైవ్--అలైవ్ కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యం, విద్య, మహిళల రక్షణ, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చుని, అధికార యంత్రాంగం



సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. డీసీపీ ఎ. భాస్కర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. 20 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు రోడ్డు ప్రమాదాల్లో అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల్లో రోడ్డు భద్రతపై అవగాహన



పెంచడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని కోరారు. రాత్రి వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలికల భద్రత కోసం షీ టీమ్ సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసైనట్లు సమాచారం అందిస్తే వారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని, చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటామని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.